# నా కిప్పుడే దీపావళి

కుమారి నిరుపమ గురుషల్

"పండుగకు పోలేదా బ్రదర్! దర్జాగా సైకిలుతీసియిచ్చే వారేగా?" రామం నవ్వుతూ అడుగుతూ ప్రవేశించేసరికి ఏదో ఇంగ్లీషు నవల చదువుకొంటున్న రాజు ఉలిక్కిపడ్డాడు. కానీ రామం వేసిన ప్రశ్నను గురించి రాజు ముహం నల్లపడిపోయింది. స్నేహితునిలోని మార్పును కనిపెట్టిన రామం నవ్వడం ఆపి బుద్ధిమంతునిలా కూర్చున్నాడు.

రాజు తిరిగీ పుస్తకంలో లీనమయ్యాడు. రామం దీర్ఘనిట్టూర్పు వదిలాడు. ఎందుకో అప్పుడేలేచి "వస్తారా - బ్రదర్! నీకో శుభవర్తమానం చెప్పిపోదామని వచ్చాను. దీపావళి రోజున్నే మూర్తీరావు మా సరళని చూడ్డాని కొస్తారుట. నీవుగానీ మద్రాసు వెళ్ళకుండావుంటే ఆ రోజు నీవు వస్తావా? సరీగ్గా ఆ రోజే నేను మద్రాసు నుండీ వస్తాను తిరిగి" అన్నాడు.

"ఓ! నీవు మద్రాసు పోతున్నావా?" అని మాత్రం అన్నాడు రాజు తలతిప్పకుండానే.

"అవును. వస్తారా!" అని రామం వెళ్ళిపోయిన తర్వాత రాజు విసుగ్గా పుస్తకాన్ని నేలకేసి కొట్టాడు. బరువుగా తల వాల్చి పడుకొన్నాడు. రాజు కండ్లకి సంవత్సరపుక్రితం విషయాలు సినిమా బొమ్మలలా కనపడడం మొదలు పెట్టినవి.

'అబ్బ! ఎంత చెడ్డరోజులు! విమల- ఆ కురూపి తన భార్య! తను అగ్నిసాక్షిగా తాళికట్టాడా? అబద్ధమా? అబద్ధమయితే ఎంత బాగుండు! రాధనెలా మర్చిపోవడం? ఆ పిల్లనే పెళ్లాడాలని ఎంతో ఆశపడ్డాడు తాను! రాధ ఎక్కడ? విమలెక్కడ? రాధ కాలిగోరి అందమైనా లేని ఆ కురూపికి తన్ను విధి ఎట్లా భర్తను చేసాడు? నిజంగానే జరిగిందా పెళ్లి? అబ్బ! ఎంత దారుణమైన సంఘటన అది! ఎట్లా భరించడం? జీవితంలో విమలతో ఎదురైతే రాధకు "అంతకన్నా అవమానం ఏముంది? పాపం! ఎక్కడుందో గదా! పెళ్లి అయిందో - లేదో? తనకు మాత్రం ఆ కురూపితో పెళ్ళయిపోయింది! దీపావళి పండగకట! పోవాలట తాను! ఛీ! అమ్మకి తగ్గ శాంతి చెయ్యాలి. చక్కగా ఆ రోజు రామం ఇంటికెళ్ళి కూర్చుంటాను. పాపం సరళకూడా ఎంతో బావుంది. కళ్లులేనివిధి ఒకవేళ మూర్తితో ఆ పిల్ల

పెళ్ళి రాసాడేమో! ఏమిటీ దాంపత్య జోళ్లు!''

♦ ♦ ♦

''ఎప్పుడు పోతావురా? రాత్రిబండికా?''

రాజు వులిక్కిపడిలేచాడు. అమ్మ గొంతు! దీపావళికి పొమ్మని హుకుం కాబోలు!

''ఏమిట్రా? పెట్టెబేడా సర్దుకోలా?''

రాజు ముఖం ఎఱ్ఱపడ్డది. కన్నతల్లి కాకపోతేనా - ఇహ తాను నోరు తెరిస్తే చాలు. ఏం మాటలు వస్తాయో తనకు తెలీదు. తర్వాత ఆమె ఏడుస్తూ కూర్చుం టుంది.

''త్వరగా తెములు!''

రాజు మాట్లాడలేదు. రత్నమ్మగొంతు ఆ తర్వాత వినరాలేదు. అమ్మని తల్చు కొంటేకూడా రాజు ఎంతో ఇదయి పోతాడు. ఇప్పుడు నాన్నారు లేరుకానీ ''ఆ భయంకరమైన స్వరూపాన్ని అమ్మ ఎలా వరించిందో? ఇద్దర్ని ఎలాకందో?

రాజుకంతా విచిత్రంగానేవుంది! ఏమిటీ జోళ్లు?

౨

''మొత్తానికి నీవు పోలేదన్నమాట! నీ వరస నాకేమాత్రం బాగలేదురా!''

''అదిసరేగానీ - మూర్తి కివ్వడం న్యాయమేనా సరళను?''

''ఏం? మూర్తి నీ దృష్టిలో అంద గాడు కాదనా?''

''నా దృష్టివరకూ వద్దు, నీ దృష్టిలో చెప్పు! సరళ కన్యాయం చేస్తున్నావురా! మరి.''

''ఇందులో నా పాత్ర ఏదీలేదురా. అంతా సరళ, వాళ్లవదిన, అమ్మ ఇష్టమే అంతా.''

''నాకేమో అసంతృప్తిగావుంది'' రాజు తిన్నగా అన్నాడు.

''మనదేం సినిమా ' జీవితమటరా! అంజలి, నాగేశ్వరరావు, సావిత్రి, రామా రావు అని అందంగా హీరో, హీరోయిన్లలా జత కుదర్చడానికేని! అంజలి భర్త ఎలాగున్నాడో, నాగేశ్వరరావు భార్య ఎలాగుందో నీవు చూసావా?''

''నీతో మాట్లాడడం నాచేతకాదురా'' విసుగ్గా అన్నాడు రాజు.

రామం నవ్వాడు. ఇంతలో మేళంతో పిలుపువారు రావడంతో రాజు కిటికీ దగ్గ రగా నిలపడ్డాడు. ''ఇంకెవ్వరు! అహా! రాధ! రాధ!'' రామం తల్లితో వస్తూ వుంది. సరళ పెళ్లిపిలుపుకుకదా రావడం వీళ్లు!

రామం రాజు చేష్టలని కనిపెట్టక పోలేదు. "అన్నట్లు! ఆ అమ్మాయే నీ చెల్లెలురా! ఓ రాధ ఇలారా! ఇతనే తరళ అన్నగారు. మీ స్నేహితురాలు విమల భర్త అయిన రాజారావు" అని భార్యను పిలిచి పరిచయంచేసాడు. రాధ మొదట ఉలిక్కిపడ్డది. ఎలాగో "నమస్తే" అని మాత్రం అనగలిగాడు రాజు. రాధ నవ్వుతూ "నమస్తే" అన్నది.

రాజు చిత్తరువులా నిలపడిపోయాడు! ఓరి కళ్ళులేని విధీ! రామం పెళ్ళామా రాధ!!!

## 3

"ఏమన్నయ్యా! విమల నింకా పిల్చుకొనిరాలేదా!" అని ఎంతో చనువుగా అడిగింది రాధ పెళ్ళికొచ్చిన రాజును. రాధ ఎంతో ఉత్సాహంగా తిరుగుతుంది చిలకల్లే. రామం ఎంతో అభిమానంగా పిలుస్తున్నాడు. రాధ అక్కడివారితోఅప్యాయంగా బదులు చెప్పుతూంది. తానొక కురూపికి భార్య అయిపోయినందుకు ఆ పిల్ల చిన్న శెనగ్గింజంతకూడా కృంగిపోయినట్లులేదు. ఔరా!

ఎలాగో తీరిక చూచుకొని రాజు అన్నాడు "రాధా! నీవేనా రాధవి?"

"అవును. నీవు మాత్రం మునుపటి రాజువికావు."

"రాధా! నన్ను కొన్ని విషయాలు నిలువునాకృంగతీస్తున్నవి.నీవు...నీవు..."

"చాలు! ఆపు–రాజూ! ఎవరేనా వినగలరు. ఎప్పుడో ప్రేమించుకొన్నాం, అయింది – పోయింది. ఇప్పుడిద్దరం వివాహితులం. నీవు నన్ను తల్చుకుంటూ, నేను నిన్ను తల్చుకొంటూ, ఇటూ నా భర్తను, అటూ నీ భార్యని కృంగతీయడంతప్ప ఇంకేంలేదు. మనకా ధైర్యంలేదు–పాడులేదు. పెద్దవాళ్లని ఎదిరించలేము. తర్వాత మాత్రం కృంగిపోవడం చేత అవును. కానీ అది నాకు చేతకాలేదు. నీ భార్యను కాకపోయినా నీ మిత్రుని భార్యనయినందుకు సంతోషపడు! నిన్ను విమల భర్తగా పొందినందుకు నాకెంతో ఆనందంగావుంది. విమలను సుఖపెట్టు!"

రాజు దిమ్మతిరిగిపోయాడు. రాధ తర్వాత కనపడలేదు. రాజు మనసు ఒక్కసారి ప్రశాంతమయి పోయింది. పాపం! విమల ఏమనుకొందో – తాను దీపావళికి రాలేదని! ఎంతగా కృంగిపోయిందో? తాను మనస్ఫూర్తిగా ప్రేమించిన రాధ! రాధ ఎంతగా మారిపోయింది! అవును. రాధ అన్నట్లు పెద్దలను ఎదిరించడానికి తనకెన్ని గుండెలున్నవి? రాధ జాతకం బాగలేదని పెద్దలు అంటే తానేం చేసాడు? వాదించి బాగలేకపోయినా పెళ్లాడి తీరుతానని

ముందడుగు వేసాడా? లేదు! మరునాడు అనుకోని విధంగా కొడుకు అత్తగారింటికి పయనమయిపోతుంటే రత్నమ్మ కండ్ల నుండి ఆనందభాష్పాలు నాలుగురాల్చింది!

"దీపావళికి అల్లుడొచ్చాడు" అని మరదలు హాస్యంచేసింది రాజును.

"నాకిప్పుడే దీపావళి" అన్నాడు నవ్వుతూ విమలని చూస్తూ రాకొంటెగా!

జన్మదిన సందర్భమున ప్రపంచమంతా ఆరాధించిన



పూజ్య బాపూజీ